# ఎకానమీ

## భారతదేశం - పర్యావరణ విధానం

మానవ మనుగడకు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధికి, వృత్తుల వారి బతుకుతెరువుకు పర్యావరణం, సహజ వనరులు అత్యంత కీలకం. మనిషి భవిష్యత్ నిర్ణయానికి, జీవన విధానానికి సహాయం చేసే అనేక సేవలను పర్యావరణం అందిస్తుందనే విషయాన్ని సమాజం అంగీకరించింది. అంతే కాకుండా పర్యావరణ వనరులను విచక్షణారహితంగా వినియోగించడం వల్ల వచ్చే సమస్యలను గ్రహించింది.

పర్యావరణాన్ని రక్షించుకోకపోతే మానవ జాతి మనుగడకు ముప్పు తప్పదు. దీన్ని గ్రహించడం వల్లే పర్యావరణ బాధ్యతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ప్రజలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావడానికి సిద్ధమవుతున్నారు. ఈ కారణంగా ప్రపంచవ్యాప్తంగా గత దశాబ్దంలో పర్యావరణం – అభివృద్ధి, వనరుల అభిలషణీయ వినియోగం లాంటి అంశాలు అధిక ప్రాధాన్యం పొందాయి. ప్రపంచ దేశాల ప్రభుత్వాలు అనేక చట్టాలు చేసి తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి.

### భారత్ – పర్యావరణ అంశాలు

భారతదేశం ప్రధానంగా పర్యావరణ సంబంధ అంశాలపై ప్రభావం చూపే అనేక అంశాలపై చట్టాలను రూపొందించింది. వాటిలో 1988 జాతీయ అటవీ విధానం, 1992లో పర్యావరణం, అభివృద్ధిపై ఒక సంరక్షణ వ్యూహం, విధాన ప్రకటన ప్రధానమైనవి. అంతేకాకుండా పర్యావరణానికి సంబంధించి ప్రభావం చూపే ఇతర అంశాలపై కూడా కొన్ని విధానాలను రూపొందించింది. 2000లో జాతీయ వ్యవసాయ విధానం, ఇదే సంవత్సరంలో జాతీయ జనాభా విధానం, 2002లో జాతీయ జల విధానం మొదలైనవి ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాలు. ఈ విధానాలు పర్యావరణ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడ్డాయి. పై విధానాలు అన్నీ కూడా సుస్థిర అభివృద్ధి ప్రాధాన్యాన్ని గుర్తించి అమలు వ్యూహాలు తయారీకి ప్రయత్నం చేశాయి. కానీ వీటిని సమీక్షించాల్సిన సమయం, పునఃపరిశీలించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. సమాజంలో పలు రంగాల కార్యకలాపాలను పర్యావరణ పరిరక్షణపరంగా సమీక్షించడానికి, పర్యవేక్షించడానికి నియమ నిబంధనలు, నూతన అవసరాలను బట్టి సవరించడానికి అవసరమైన వెసులుబాటు ప్రతి విధాన రూపంలో అంతర్గతంగా ఏర్పాటు చేయాలి. దేశ ఆర్థికాభివృద్ధి అంశంలో ప్రజా సంక్షేమం మెరుగుపరచడమే లక్ష్యంగా పునరావృతమవుతున్న ఒక అంశం పర్యావరణ పరిరక్షణ. ఈ సందర్భంలో దేశంలో ఏర్పడిన ఏకాభిప్రాయానికి కింది అంశాలను మూల కారణాలుగా చెప్పవచ్చు.

- ✪ మానవుల జీవన నాణ్యతను పెంచడం.
- ✪ జీవావరణ వ్యవస్థ పరిమితిని అంగీకరించడం, దాన్ని గౌరవించడం.
- ✪ సుఖ సంతోషాలతో జీవించాలనే కోరిక కానీ, జీవ, భౌతిక పరిమితుల గుర్తింపు కానీ ప్రపంచంలో మరింత న్యాయం కోసం చేసే అన్వేషణకు ఆటంకం కాకుండా ఉండాలి.

దీని కోసం ఆర్థిక, సాంఘిక, పర్యావరణ సంబంధ అంశాల మధ్య సమతౌల్యం ఏర్పడాలి. అందుకోసం భారతదేశం అంతర్జాతీయ ఒప్పందాల్లో సంతకాలు చేసింది. తద్వారా పర్యావరణ అంశానికి సంబంధించిన సమస్యలు భౌగోళిక పరిధులు దాటి వ్యాపించాయని, ఒక దానితో ఒకటి సంబంధాలు కలిగి ఉన్నాయని భారత్ గుర్తించింది.

### భారత రాజ్యాంగం – పర్యావరణ అంశాలు

భారత రాజ్యాంగం కూడా పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంది.

1) 48A, 51A(g) అధికరణలు దేశమంతటా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పరచాలని ఆదేశిస్తున్నాయి.

2) ఈ విషయాన్ని 21వ అధికరణం న్యాయమైన విషయంగా బలపరుస్తుంది.

ఆరోగ్యకర పర్యావరణాన్ని నిర్వహించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదనీ, ప్రతి పౌరుడి బాధ్యతని తెలుపుతుంది.

**జాతీయ పర్యావరణ విధానం లక్ష్యాలు**

2006 జాతీయ పర్యావరణ విధానం లక్ష్యాలు కింది విధంగా ఉన్నాయి.



R-12-4-18

**కీలక పర్యావరణ వనరుల రక్షణ:**

కీలకమైన పర్యావరణ వనరులను మనుగడకు, సంక్షేమానికి అవసరమైన, వెలకట్టలేని సహజ వారసత్వాన్ని, మానవుడు పెంపొందించిన వారసత్వాన్ని కాపాడటం, సంరక్షించడం ఈ విధాన లక్ష్యాలు.

**అంతర తరాల సమానత:**

సుస్థిర, సమతౌల్య పర్యావరణ అనుకూల ఆర్థికాభివృద్ధి సాధనకు కృషిచేయడం. ప్రస్తుత తరంతోపాటు భవిష్యత్ తరాల అవసరాలు, కోరికలను తీర్చడానికి పర్యావరణ వనరులను యుక్తాయుక్త విచక్షణతో వినియోగించడం ద్వారా సాధించవచ్చు.

**సమర్థమైన పర్యావరణ వనరుల వినియోగం:**

ఆర్థిక ఉత్పత్తి కోసం వినియోగించే వనరుల తలసరి వాడకాన్ని తగ్గించడం, సమాజం మీద పర్యావరణ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించటం ద్వారా పర్యావరణ వనరుల వాడకం సమర్థంగా ఉండేలా చూడటం దీని ప్రధాన లక్ష్యం.

**వనరుల పెంపుదల:**

వనరుల సంరక్షణ, పెంపుదల కోసం తదనుగుణమైన సాంకేతిక విజ్ఞానంతో పాటు, సంప్రదాయ విజ్ఞానాన్ని, నైపుణ్యాలను, సాంఘిక పెట్టుబడులను తగిన విధంగా వినియోగించి వనరులను వృద్ధి చేయడమే ఈ విధాన లక్ష్యం.

**వనరుల నిర్వహణలో సుపరిపాలన:**

వనరుల నిర్వహణలో సరైన సూత్రాలను ఆచరించడం, పారదర్శక విధానాలు, హేతుబద్ధత, జవాబుదారీతనం, వ్యయం, సమయం తగ్గించడం ద్వారా సమర్థతను పెంచడం, ప్రజా భాగస్వామ్యాన్ని అనుసరించడం లాంటి సుపరిపాలన సూత్రాలను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా పర్యావరణాన్ని రక్షించడం లక్ష్యం.

**పేదల ఉపాధి భద్రత:**

తమ జీవనోపాధి కోసం పర్యావరణ వనరుల మీద అధికంగా ఆధారపడే పేదలు, గిరిజనులందరికీ సమానత్వ సూత్రం ఆధారంగా సహజ, ప్రకృతి వనరులను అందుబాటులో ఉంచడం దీని లక్ష్యం.

**సాంఘిక, ఆర్థిక అభివృద్ధితో పర్యావరణ అంశాలను సమైక్యపరచడం:**

సాంఘిక – ఆర్థిక అభివృద్ధి కోసం అనుసరించే విధానాలు, ప్రణాళికలు, కార్యక్రమాలతో పర్యావరణ అంశాలను సమైక్యం చేయడం ద్వారా పర్యావరణ అనుకూల, గ్రామీణ సుస్థిర వృద్ధి సాధించడం దీని లక్ష్యం.

**సమ్మిళిత విధానాలు:**

ఆర్థిక వ్యవస్థలో సమ్మిళిత విధానాల ఆధారంగా అన్ని వర్గాల మధ్య సహజ వనరుల సక్రమ పంపిణీ, వినియోగం ద్వారా వనరులను అభిలషణీయంగా ఉపయోగించడం.

## పర్యావరణ వనరుల సంరక్షణ వ్యూహం

భారతదేశంలో పర్యావరణ వనరులను సంరక్షించడానికి కింది వ్యూహాన్ని అనుసరిస్తున్నారు.

- నేల నాణ్యత క్షీణత నివారణ
- అడవి అభివృద్ధి వ్యూహం
- వన్యప్రాణులు
- జీవ వైవిధ్యం
- తడి నేలలు
- మానవ నిర్మిత వనరుల సంరక్షణ
- పర్యావరణ సున్నిత మండళ్లు
- పర్వతాల నిలకడ గల అభివృద్ధి వ్యూహం

- నిలకడ ఉన్న తీరప్రాంత వనరుల వ్యూహం
- మంచినీటి వనరుల సంరక్షణ వ్యూహం

### నేల నాణ్యత క్షీణత నివారణ వ్యూహం

భూమి నాణ్యత క్షీణించకుండా ప్రభుత్వాలు, ఎన్జీవోలు, ప్రజాసంస్థలు కింది చర్యలను తీసుకోవాలి.

- పర్యావరణ అభివృద్ధికి నేల నాణ్యత క్షీణతను నివారించడం ఒక ముఖ్యమైన వ్యూహం. దీని కోసం పరిశోధన, అభివృద్ధి ద్వారా శాస్త్రీయ ప్రాతిపదిక, సంప్రదాయ నిలకడ ఉన్న భూ వినియోగ పద్ధతులను అమలుచేయాలి.
- రైతులకు శిక్షణ ఇవ్వడం, పైలెట్ తరహా విధానాలు అమలు చేయడం ద్వారా అభివృద్ధికి, నేల క్షీణత తగ్గించే వ్యూహాలు అమలు చేయడం.
- యాజమాన్యం, స్థానిక సమాజం, పెట్టుబడిదారులు పాలుపంచుకునే విధంగా బహుళ వాటాదారుల భాగస్వామ్యం రూపొందించి, అనుసరించటం ద్వారా పోరంబోకు భూములను, అటవీ భూములను సేద్యానికి అనుకూలమయ్యేలా చూడాలి.
- కార్యాచరణ ప్రణాళికల ద్వారా ఎడారీకరణ తగ్గించడం ద్వారా నేల క్షయాన్ని నివారించాలి.

### అడవుల సంరక్షణ, అభివృద్ధి వ్యూహం

అణగారిన అటవీ భూములు, పోరంబోకు భూముల్లో అడవులను పెంచడం, ప్రైవేట్, రెవెన్యూ భూముల్లో చెట్లు పెంచడం ద్వారా దేశంలోని మొత్తం భూమిలో అడవులు, చెట్ల ఆచ్ఛాదన 23% నుంచి (2012 నాటికి) 33% పెంచడానికి ఒక ప్రధాన వ్యూహాన్ని రూపొందించడం.

ఈ వ్యూహంలో కింది ప్రధాన అంశాలు ఉంటాయి.

- పర్యావరణ ఉపాధి, విత్త సంబంధ ప్రయోజనాలను పొందడానికి వీలుగా అటవీ శాఖ, స్థానిక సమాజం, పెట్టుబడిదారులు పాల్గొనేలా బహుళ వాటాదారుల భాగస్వామ్యాన్ని అమలుపరచడం. పాలనా నిబంధనలను పాటిస్తూ ప్రతి భాగస్వామికి ఉండే కర్తవ్యాన్ని, హక్కును స్పష్టంగా నిర్వచించడం.
- ప్రకటిత అటవీ ప్రాంతాల వెలుపల అటవీ జీవ రాశులను పెంచడం ద్వారా పరిమితులు హేతుబద్ధం చేయడం.
- పంటల ద్వారా వచ్చే ఫలితాల కంటే ఎక్కువ ఫలితాలను సాధించే సామాజిక అడవుల పెంపకం ద్వారా సమతౌల్యాన్ని అభివృద్ధి చేయడం.
- అడవుల సంయుక్త నిర్వహణ వ్యవస్థను దేశవ్యాప్తంగా సార్వత్రీకరించడం.
- తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర అవసరాలకు మళ్లించిన అడవుల పర్యావరణ విలువను లెక్కించడానికి తగిన విధానాన్ని రూపొందించడం.
- అడవుల్లో నివసించే గిరిజనుల సంప్రదాయ హక్కులకు న్యాయపరమైన గుర్తింపులు ఇవ్వడం. అడవుల సంరక్షణ కోసం వారికి దీర్ఘకాలిక ప్రోత్సాహకాలను అందించడం.

### వన్యప్రాణులు

వన్యప్రాణుల సంరక్షణ కోసం కింది చర్యలను తీసుకుంటారు.

- దేశంలో రక్షిత ప్రాంతాలను అనుసంధానం చేయడం ద్వారా విస్తరింపచేయడం. ఈ ప్రక్రియలో ప్రతి జీవ, భౌగోళిక మండలిలో అనుసంధానించిన మొత్తం ప్రదేశం కచ్చితంగా పెరిగేలా చూడటం.
- అడవుల్లోని వన్య ప్రాంతాల్లో పర్యావరణ పర్యటకాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించడం, అడవుల పెంపకంలో బహుళ వాటాదార్ల భాగస్వామ్యాన్ని, సమాంతరీకరణ సంరక్షణను, సామాజిక రిజర్వుల్లోని వన్యప్రాణుల అలవాట్లను పెంచడానికి సరూప భాగస్వామ్యాలు పెరిగేలా చూడటం ప్రధానాంశాలు.

## జీవ వైవిధ్యం

జాతీయ జీవ వైవిధ్యం కార్యాచరణ ప్రణాళిక కోసం అవసరమైన సమాచారాన్ని అందించడానికి జాతీయ పర్యావరణ పరిరక్షణ విధానం ప్రకారం ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి కింది చర్యలు చేపడతారు.

- అతి ముఖ్యమైన జీవ వైవిధ్య ప్రదేశాల రక్షణను పటిష్ఠ పరచడం ద్వారా అభివృద్ధి చేయడం.
- జీవ వైవిధ్య వనరులు, సహజ వారసత్వం మీద అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల నష్టాలు, ప్రమాదాల పట్ల దృష్టిని సారించడం ద్వారా అభివృద్ధిని సాధించడం.
- ప్రమాదం ఎదుర్కొంటోన్న మొక్కలు, పక్షులు, జీవ రాశుల మధ్య జన్యు సంబంధ పదార్థాల సంరక్షణకు ప్రాధాన్యమివ్వడం ప్రధాన లక్ష్యం.
- సంప్రదాయ, గ్రామీణ పరిజ్ఞానానికి మేథో సంబంధ హక్కులను ఇవ్వడం ద్వారా జీవ వైవిధ్యాన్ని సాధించడం.

## భారత జాతీయ పర్యావరణ విధానం – 2006

దేశాభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాల్లో పర్యావరణ అంశాలు వర్తమాన, భవిష్యత్తులో ఏర్పడే పర్యావరణ సవాళ్లను ఈ విధానం వివరిస్తుంది. లక్ష్యాలను, విధాన చర్యలను, వాటి సూత్రాలను, చట్టపరమైన చర్యలు, వ్యవస్థల అభివృద్ధికి సంబంధించిన విస్తృతమైన సూచనలను ఈ విధానంలో ప్రస్తావించారు. కార్యచరణకు ఒక మార్గదర్శిగా జాతీయ పర్యావరణ పరిరక్షణ విధానం – 2006ను రూపొందించారు. ఈ కార్యచరణలో ప్రస్తుత చట్టాల సమీక్ష, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చట్టాల రూపకల్పన, క్రమబద్ధీకరణలో సంస్కరణలు, పర్యావరణ కార్యక్రమాలు, పథకాలు, ప్రాజెక్టులు అంతర్భాగంగా ఉన్నాయి.

**మార్గదర్శక సూత్రాలు:**

- నిలకడ అభివృద్ధికి, ప్రకృతితో ఘర్షణలేని విధంగా ఆరోగ్యకరమైన జీవనానికి మానవులకు హక్కు ఉంటుంది.
- పర్యావరణాన్ని వినియోగించుకోవడంలో ప్రస్తుత తరమే కాకుండా, భవిష్యత్ తరాల అవసరాలు, పర్యావరణ అవసరాల మధ్య సమన్వాయం పాటించాలి.
- పర్యావరణ పరిరక్షణ అనేది అభివృద్ధికి సంబంధంలేని ఒక ప్రత్యేక అంశం కాదనే వాస్తవాన్ని విధానపరంగా గుర్తించాలి.
- పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అన్ని ప్రభుత్వ చర్యల్లో ఆర్థిక స్వామ్యం సాధించాలి.
- ఆర్థిక ప్రయోజనాల కంటే సామాజిక ప్రయోజనానికి ప్రాధాన్యమిచ్చి ఆ వనరులను పరిరక్షించాలి.
- పర్యావరణ వనరులను వినియోగించే విధానాలపై నిర్ణయం తీసుకునే సందర్భంలో సంబంధిత ప్రజలందరి హక్కులు, భాగస్వామ్యం విషయంలో పక్షపాతంలేని విధంగా సమతా నియమం పాటించాలి.
- పర్యావరణ హానికారకులైన వారి వల్ల జరిగిన నష్టానికి వారిని చట్టరీత్యా బాధ్యులను చేయాలి. వారిని శిక్షించడం ద్వారా భవిష్యత్తులో ఎవరూ ఈ చర్యలకు తిరిగి పాల్పడకుండా చేయాలి.
- ప్రభుత్వం సహజవనరుల ఏకైక యజమాని కాదు. కేవలం ధర్మకర్త విధులను మాత్రమే నిర్వహించాలి. ఈ వనరులు ప్రజావినియోగానికి ఏర్పడినవి.
- స్థానిక ప్రాధాన్యమున్న విషయాల్లో చర్యలు తీసుకునే అధికారాన్ని రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేయాలి. వివిధ రంగాలకు సంబంధించిన విధానాలతో పర్యావరణ అంశాలను సమైక్యం చేయాలి.
- పర్యావరణానికి సంబంధించిన పరిశోధనల్లో సామాజిక, ప్రకృతి శాస్త్రాలను సంఘటితం చేయాలి.
- పర్యావరణ విధానాన్ని అమలుపరిచే బాధ్యత ఉన్న కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలను అభివృద్ధి చేయాలి పర్యావరణ ప్రమాణాలను నిర్ధారించేటప్పుడు వాటిని వర్తింపజేసే ఆర్థిక, సామాజిక పరిస్థితుల వాస్తవికతను ఆ ప్రమాణాల్లో ప్రతిబింబించాలి.
- మానవ కార్యకలాపాల వల్ల వనరుల క్షీణత ఏర్పడిన తర్వాత వాటిని పునరుద్ధరించడం కంటే ముందుగానే, వాటిలో క్షీణత లేకుండా నివారణ చర్యలు తీసుకోవడానికి కేంద్రం, రాష్ట్రాలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ప్రాధాన్యమివ్వాలి.
- సాధారణంగా మానవ జాతి జీవనానికి ఆధారభూతమైన, సార్వత్రిక సంక్షేమానికి ఉపయుక్తమైన సహజ వ్యవస్థలను, తమ ఉనికి కోల్పోయే ప్రమాదమున్న జీవ రాశులను రక్షించడం ప్రభుత్వాల బాధ్యత.

**రచయిత: దాసరి రాజేందర్**